క్లుప్తంగా

రైతుబంధు నిధులు విడుదల చేయండి

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా ఇప్పటి వరకు రైతాంగానికి రైతుబంధు ఇవ్వలేదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సమస్యలు తీరుతాయని గత పాలనకు చరమగీతం పాడి కొత్త ప్రభుత్వాన్ని ఎంచుకుంటే ఇప్పటి వరకు రైతుల ఊసే లేదని విమర్శించారు. ఎకరం ఉన్న వారికే రైతుబంధు వేశారని ఐదు, పది ఎకరాలు అంటూ కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష సామగ్రి అందజేస్తున్న కోటేశ్వరరావు, హెచ్ఎం

జూలూరుపాడు: పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా సెక్రటరీ కొదుమూరి కోటేశ్వరరావు శనివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. 18వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా 52 మంది విద్యార్థులకు ప్యాడ్, పెన్ను, వాటర్ బాటిళ్లను హెచ్ఎం ఎస్కే మీరా సాహెబ్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ బానోత్ నవీన్, అరిగెల నరసింహారావు, గుగులోత్ శ్రీనివాసరావు, మద్దిశెట్టి వంశీ, యాసం కృష్ణయ్య, మద్దిశెట్టి ప్రకాష్, పూరేటి తిరుపతిరావు, ముళ్లపాటి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

పాల్వంచ: ఆంధ్రప్రదేశ్ బాషా సంఘం స్థాపకుడు పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ పాల్వంచ సంఘం ఆధ్వర్యంలో హైస్కూల్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చలవాది ప్రకాశ్, తాటికొండ సురేశ్, గూడెపు శ్రీనివాస్, మహంకాళి సాయి, దుర్గ, శ్రీదేవి, పద్మజ, జగదీశ్, కుమార్, పెండ్యాల శేషు, నాంపల్లి వేణు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడా'ను విజయవంతం చేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు

సుజాతనగర్: చిన్నారుల్లో పోషక లోపం లేకుండా చేపడుతున్న పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసీడీఎస్ సీతంపేట సెక్టార్ సూపర్‌వైజర్ జి.సుధతి అన్నారు. సుజాతనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడాపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్నారుల్లో పోషకలోపం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈనెల చివరి వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చిరుధాన్యాల్లో పోషకాలు ఉంటాయని, అందరూ వాటిని తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

నేడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య కార్యాలయం వద్ద కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం జరుగుతుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ... మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ పోటీ చేస్తున్నాడని తెలిపారు. ముఖ్యఅతిథులుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పాడెం వీరయ్య పాల్గొంటారని తెలిపారు.

పరీక్ష కేంద్రం పది కిలోమీటర్లు

- కొమరారం పదో తరగతి విద్యార్థులకు తప్పని పాట్లు
- సంఖ్య తక్కువగా ఉందని సెంటర్ ఏర్పాటుకు నిరాకరణ



కొమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఇల్లెందురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయి. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 776, ప్రైవేటు పాఠశాలల నుంచి 413 మంది విద్యార్థులు చొప్పున మొత్తంగా 1,189 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరి కోసం మండల వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలన్నీ విద్యార్థులు చదువుకునే పాఠశాలకు సమీపంలో ఉన్నాయి. ఒక్క కొమరారం పాఠశాలలో చదువుకునే విద్యార్థులు మాత్రం పదో తరగతి పరీక్షలు రాసేందుకు పది కిలోమీటర్లు ప్రయాణించక తప్పడం లేదు.

ఏజెన్సీలో అదొక్కటే హైస్కూల్...

ఇల్లెందు ఏజెన్సీ ప్రాంతంగా పిలువబడే కొమరారం, మాణిక్యారం, బోయితండా, పోచారంతండా, పోలారం, మర్రిగూడెం గ్రామపంచాయతీలలో ఉన్న హైస్కూల్ స్థాయి విద్యార్థులంతా కొమరారం గ్రామంలో చదువుకోవాల్సిందే. ఏ ఒక్క గ్రామపంచాయతీలోనూ ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కాకపోవడంతో ఏజెన్సీ గ్రామ పంచాయతీలకు కొమరారం ఒక్కటే దిక్కు. ఇందులో మాణిక్యారం ఆరు కిలోమీటర్లు, మర్రిగూడెం ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయినా ప్రతీరోజు సైకిళ్లపై విద్యార్థులంతా ఎంతో కష్టంతో ఉదయమే బయలుదేరి పాఠశాల సమయానికి చేరుకుంటూ విద్యనభ్యసిస్తున్నారు. దూరభారం కారణంగా రవాణా భారమై హైస్కూల్ స్థాయిలోనే చదువుకు దూరమవుతున్నారని, మరికొందరు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని ఆయా గ్రామపంచాయతీల ప్రజలు వాపోతున్నారు.

పరీక్ష కేంద్రం కూడా దూరమే..

కొమరారం ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతిలో 38 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా పదో తరగతి పరీక్షలను కొమరారానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమ్ముగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో రాయాల్సి ఉంటుంది. కానీ కొమరారం హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కొమరారంతోపాటు సమీప గ్రామపంచాయతీలకు చెందిన వారు కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30కు ప్రారంభమవుతాయి. అంటే విద్యార్థులు 9 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. కానీ ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. కానీ ఆటో నిండనిదే కదలని పరిస్థితి ఉండటంతో ఉదయం ఏడు గంటల కల్లా విద్యార్థులు గ్రామంలోని ఆటో సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంది.

సంఖ్యను సాకుగా చూపి...

కొమరారం గ్రామంలోని హైస్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటును అనువుగా ఉంటుంది. విశాలమైన తరగతి గదులు ఉన్నాయి. కానీ కేవలం విద్యార్థుల సంఖ్య 50 మించి ఉంటేనే పరీక్ష కేంద్రం మంజూరుకు విద్యాశాఖ పరిశీలించే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు సెలవిస్తున్నారు. ఇంతే కాకుండా పోలీసుస్టేషన్ లేదనే సాకును కూడా విద్యాశాఖ అధికారులు చూపడం విచారకరం.

ఫలితాలపై తీవ్ర ప్రభావం...

ప్రతీరోజు పరీక్ష కేంద్రానికి రావడం, పరీక్ష పూర్తి అయిన తరువాత తిరిగి ఇంటికి చేరుకునేందుకు విద్యార్థులకు మూడు, నాలుగు గంటల సమయం వృథా అవుతోంది. దీనికితోడు ప్రైవేటు వాహనాల్లో కిక్కిరిసిన ప్రయాణికుల మధ్య ప్రయాణించాల్సి రావడంతో విద్యార్థులు అలసిపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ కారణంగా ఉత్తీర్ణతలో కొమరారం ఉన్నత పాఠశాల ప్రతీఏటా వెనకబడి పోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా ఉత్తమ గ్రేడింగ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించలేకపోతోందని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి.

పాఠశాల దూరమైందని..



తొమ్మిదో తరగతి వరకు కొమరారం హైస్కూల్‌లో చదువుకున్నాను. ప్రతీరోజు స్కూల్‌కు వెళ్లలేక పదో తరగతి ఇల్లెందులోని ప్రైవేటు పాఠశాలలో చేరాను. మా గ్రామంలో అందరూ ప్రైవేటు స్కూల్‌కే వెళ్తున్నాం. ప్రభుత్వం స్కూల్ దూరం కావడం, పరీక్షలప్పుడు పరీక్ష కేంద్రం ఇంకా దూరం కావడంతో తప్ప లేదు.

– భూతం లోకేష్, పదో తరగతి, మాణిక్యారం

విద్యార్థులు తక్కువగా ఉన్నారు...



కొమరారం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 38. కానీ నిబంధనల ప్రకారం 50 మందికి మించి విద్యార్థుల సంఖ్య, పోలీసు స్టేషన్ సమీపంలో లేకపోవడం వంటి కారణాలతో కొమరారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు సిఫారసు చేయలేదు. విద్యార్థుల సంఖ్య పెరిగితే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తాం.

– పిల్లి శ్రీనివాస్, ఎంఈఓ, ఇల్లెందు మండలం

ఈ సారైనా నడక యాతన తప్పేనా?


యానంబైల్ నుంచి కాలినడకన కిన్నెరసాని పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

పాల్వంచరూరల్: ప్రతీ సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల కేంద్రం దూరబారంగా మారింది. ఈ సారైనా ప్రత్యేక వాహన సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. మండలంలోని కిన్నెరసాని కాల్వపై భాగంలో ఉన్న యానంబైల్ హైస్కూల్‌లో 20 మంది విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిన్నెరసానికి, పాండురంగాపురంలో 44 మంది విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామంలో పరీక్ష రాయనున్నారు. ఉల్వనూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులకు మాత్రం ప్రతీ సంవత్సరం ఐటీడీఏ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుంది. వీరు మాత్రం ప్రతీసంవత్సరం పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోల్లో వెళ్లి పరీక్ష రాయాలంటే వ్యయ బారమవుతుందని, అంతే కాకుండా కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోందని, పిల్లలు అలసిపోయి పరీక్షలు సరిగా రాయలేక పోతున్నారని విద్యార్థులు, తల్లిందడ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు కోరినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని హెచ్‌ఎంలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

హాల్ టికెట్ చూపితే బస్సు ఆపుతారు...

మండలంలో యానంబైల్ హైస్కూల్ విద్యార్థులు కిన్నెరసాని పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తారు. పాండురంగాపురం హైస్కూల్ విద్యార్థులు ఉప్పుసాక సెంటర్‌లో పరీక్షలు రాయడం జరుగుతుంది. విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపిస్తే బస్సులు ఆపుతారు. ఉచితంగా ప్రయాణించి పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చు.

– శ్రీరామ్మూర్తి, ఎంఈఓ, పాల్వంచ

గిరిజనేతరులను నియమించొద్దు..


వినతిపత్రం అందజేస్తున్న బంజారా నాయకులు

జూలూరుపాడు: పాఠశాలల పునరుద్ధరణ కోసమని అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా నిధులు విడుదల చేసేందుకు చెక్ పవర్ గిరిజనేతరులకు ఇవ్వరాదని డిమాండ్ చేస్తూ భారతీయ గోర్ బంజారా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. హెచ్‌ఎంతోపాటు, గ్రామసమాఖ్య అధ్యక్షురాలికి జాయింట్ అకౌంట్ ఇవ్వడం 1/70 యాక్ట్‌కు విరుద్ధమన్నారు. గ్రామసమాఖ్య మహిళా అధ్యక్షురాలిను తొలగించి విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరికి, హెచ్‌ఎంకు జాయింట్ అకౌంట్ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో భూక్యా శివకుమార్, తగరం కరుణాకర్ పాల్గొన్నారు.

వెంగన్నపాలెంలో..

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం, గ్రామసమాఖ్య అధ్యక్షురాలికి జాయింట్ అకౌంట్ తీయాలనే నిబంధన నిలిపి వేయాలని కోరుతూ పేరెంట్స్ శనివారం వెంగన్నపాలెం హెచ్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. కాకటి సుగుణరావు, దిబ్బెందుల నరేష్, లెనిన్, ఝాన్సీ, కవిత, మాణిక్యమ్మ, అమృతమ్మ పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని నివారించవచ్చు

జూలూరుపాడు: తొలిదశలోనే కుష్టు వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని ఎల్‌సీడీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సర్వేని జూలూరుపాడులో ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కుష్టు వ్యాధి లక్షణాలు, గుర్తింపు, చికిత్స, నివారణ చర్యలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి సాధారణంగా మైకోబ్యాక్టీరియమ్ లేప్రె అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి మొద్దుబారిన మచ్చలను సకాలంలో గుర్తించి చికిత్స అందించినట్లయితే అంగవైకల్యం రాకుండా రోగ లక్షణాలను తగ్గించవచ్చన్నారు. ఎండీటీ ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఫిజియోథెరపిస్ట్ జి.భద్రం, పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజశ్విని, డీపీఎంఓ ఐ.వెంకటేశ్వరరావు, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రాజీపడిన కేసులకు చట్టబద్ధత


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు వారి షరతులకు లోబడి మనస్ఫూర్తిగా రాజీ చేసుకోవచ్చని అదేవిధంగా ఒకసారి లోక్ అదాలత్‌లో రాజీ పడితే హైకోర్టులకు అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని కక్షిదారులు తమ విలువైన కాలాన్ని డబ్బును ఆదా చేసుకోవచ్చని, రాజీ పడితే ఒకరు గెలిచి మరొకరు ఓడినట్లు కాదని ఇరువర్గాలు గెలిచినట్లేనని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి తెలిపారు. శనివారం ఇల్లెందు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసులను పరిష్కరించారు. ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్, జనరల్ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ, న్యాయవాదులు రవికుమార్, కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావు, ఏపీపీ వేముల రచిత, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున్‌రావు, టి.ప్రభాకర్, బాలకృష్ణ, నారాయణ, గోపీనాథ్, దంతాల ఆనంద్, ఖాసీం, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మాతాశిశు ఆస్పత్రిలో తాగునీరు కరువు


ఆస్పత్రిలో పరిశీలిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 8వ వార్డులోని మాతాశిశు ఆస్పత్రిలో మంచినీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. శనివారం మాతాశిశు ఆస్పత్రిని సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సమస్యలను అక్కడికి వచ్చిన పేషంట్లు, వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... రోగులు మూడు రోజులుగా మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆస్పత్రికి రెండు కిలోమీటర్ల దూరం రామవరం సెంటర్‌కు వెళ్లి బాటిళ్లతో నీళ్లు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నట్లు చెప్పారు. పేరుకే పెద్దాస్పత్రి కానీ కనీసం తాగడానికి కూడా మంచినీళ్లు లేవన్నారు. ఆస్పత్రిలో మూడు రోజులుగా మంచినీరు రాకపోతే జిల్లాస్థాయి అధికారులు ఏం చేస్తున్నారన్నారు. తక్షణమే స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, శుభ్రంగా ఉంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భుక్యా రమేష్, ఉగ్గం కోటేశ్వరరావు, బడుగుల శివాజీ, సలీం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి


ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

ఇల్లెందురూరల్: 19 ఏళ్లుగా వీఓఏలుగా సేవలందిస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వీఓఏలు శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. గ్రామాలలో మహిళాభ్యున్నతికి, మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు అందేలా సహకరిస్తున్నామని వివరించారు. పొదుపు సంఘాలకు సంబంధించిన పనులతోపాటు ప్రభుత్వపరంగా పలు సర్వేలలో భాగస్వాములవుతున్నట్లు తెలిపారు. కానీ నెలకు కేవలం రూ.5వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని వాపోయారు. తమను ఉద్యోగులుగా గుర్తించాలని, పనికి తగ్గట్టుగా వేతనం మంజూరు చేయించాలని కోరారు.

బోర్‌వెల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు

జూలూరుపాడు: తాగునీటి ఎద్దడి నివారణకు బోర్‌వెల్స్ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షలు మంజూరైనట్లు ఇంట్రావిలేజ్ డీఈ ఎం.శివయ్య తెలిపారు. శనివారం తవిసిగుట్టతండా, కరివారిగూడెం కాలనీ, వెంగన్నపాలెం, దుబ్బతండా గ్రామాల్లో బోర్‌వెల్స్ ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డితో కలిసి డీఈ బోర్ పాయింట్‌కు మార్కింగ్ ఇచ్చి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, మాలోత్ మంగీలాల్ నాయక్, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, కొలిపాక వెంకటేశ్వర్లు, అల్లాడి లింగారావు, తోట శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మిగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరం


కేడెట్లతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కోల్‌బెల్ట్ పరిసర ప్రాంతాల్లోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 100 మంది సింగరేణి పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన కమ్యూనిటీ సింగింగ్ శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ... సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ చిల్డ్రన్స్ పార్క్‌లో నిర్వహించిన ఐదు రోజుల శిబిరం ముగిసిందన్నారు. ఈ శిక్షణలో సర్వమత ప్రార్థనలు స్కౌట్స్ పాల్గొనటం అభినందనీయమన్నారు. అంతేకాకుండా దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, విపత్తుల సమయంలో ధైర్యంగా ముందుకెళ్లి సేవచేసే విధంగా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవర్చుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో చైతన్యం రావడానికి స్కౌట్స్ ఉద్యమంలో పాల్గొనడానికి కంపెనీ బడ్జెట్ కేటాయించి వారికి సహకరిస్తుందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా కంపెనీ నిర్వహించే స్కౌట్ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కోడూరు శ్రీనివాసరావు, బి.సుశీల్‌కుమార్, వరప్రసాద్‌రావు, స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.

కేవీఎల్ఎన్ఆర్‌కు నివాళి


సింగరేణి(కొత్తగూడెం): కేవీఎల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


ఇల్లెందు: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

సింగరేణి(కొత్తగూడెం): స్వాతంత్య్ర ఉద్యమ సమయాన చిన్న వయస్సులోనే కొండపల్లి నరసింహారావు స్కూల్‌లో జాతీయ జెండా ఎగురవేసి మాతృభూమి పట్ల దేశభక్తిని చాటారని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. శనివారం స్థానిక మంచికంటి భవన్‌లో లక్ష్మీనారాయణ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి నైజాం వ్యతిరేక పోరాటంలో ప్రజలను చైతన్యవంతం చేసి కేవీఎల్ కీలక పాత్ర పోషించారన్నారు. ఇల్లెందు నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యేగా 1952లో ఎన్నికై ఆ తరువాత మూడుసార్లు గెలిచి స్వచ్ఛమైన పాలన అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, కొండపల్లి శ్రీధర్, భుక్యా రమేష్, కే.సమ్మయ్య, డి.వీరన్న, జునుమాల నగేష్, జి.రాజారావు, నాగకృష్ణ, రామ్‌చరణ్, సతీష్, వేణు, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: జీవితమంత పీడిత ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసిన కేవీఎల్ నర్సింహారావు సేవలు మరువలేనివని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ఏ నబీ తెలిపారు. శనివారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో కేవీఎల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, హుస్సేన్, వీరభద్రం, వైకుంఠం, పద్మ, కోటమ్మ, భవానీ, హేమ్లీ, దుర్గ, నాగమణి పాల్గొన్నారు.

కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ ఆందోళనలు


సూపర్‌బజార్(కొత్తగూడెం): పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే వనమా తదితరులు


ఇల్లెందు: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎమ్మెల్సీ కల్లకుంట్ల కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని నిరసన వ్యక్తం చేస్తూ బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని దుయ్యబట్టారు. అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పోలీసులు వనమా వెంకటేశ్వరరావుతోపాటు బిఆర్ఎస్ నాయకులు కోనేరు సత్యనారాయణ, చుంచుపల్లి ఎంపిపి బాదావత్ శాంతితో పాటు పలువురిని అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 151 సెక్షన్ కింద కేసు నమోదు చేసి విడుదల చేశారు. ఈకార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి ఎంపిపి భూక్య సోన, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దూడల బుచ్చయ్య, లక్ష్మీదేవిపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, సుజాతనగర్ మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యా సత్యనారాయణ, నాయకులు మోరె భాస్కర్, యూసుఫ్, నవతన్, దుర్గ, రతన్‌నాయక్, మోతి, తొగర రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, దుర్గేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఎమ్మెల్సీ కవిత అరెస్టు రాజకీయ ప్రేరేపితమైందని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. శనివారం ఇల్లెందులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. హరిప్రియ మాట్లాడుతూ... విచారణ పేరుతో అయోమయానికి గురిచేసిన సీబీఐ, ఈడీలు ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను దెబ్బ తీసేలా కుట్రలో భాగంగా అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. బీఆర్ఎస్ నేత దిండిగల రాజేందర్ మాట్లాడుతూ... ఈడీ, సీబీఐ చర్యలకు బీఆర్ఎస్ భయపడదన్నారు. కౌన్సిలర్లు జేకే శ్రీను, కటకం పద్మావతి, అనిత, కడకంచి పద్మ, వి.తార, శీలం రమేష్, పోషం, సరిత, ఎర్రబెల్లి కిష్టయ్య, జబ్బార్, గిన్నారపు రాజేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: కేసీఆర్ కుమార్తె కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం టేకులపల్లి సెంటర్‌లో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో బానోతు హరిసింగ్‌నాయక్, బోడ బాలు, బానోతు కిషన్, ఫూల్‌సింగ్, తేజావత్ రవి, బానోతు రామ, భూక్యా పాపా, ఇస్లావత్ నామానాయక్ తదితరులు పాల్గొన్నారు.